కష్టసుఖములు ఒకరీతి గాంచవలయు
కలిమి లేములు విడదీసి చూడరాదు.
కీర్తి అపకీర్తులను ఒక మూర్తిగానె
భావమందున తలచుటె భక్తి పథము.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

ఈ జగత్తునందు మంచి చెడ్డ, కలిమి లేమి, కీర్తి అపకీర్తి ఇవన్నీ జంట పక్షులు. సుఖము లేక దుఃఖము లేదు. దుఃఖము లేక సుఖమునకు విలువ రాదు. సుఖమునుండి సుఖము ప్రాప్తించదు. దుఃఖము నుండియే సుఖము ప్రాప్తిస్తుంది. అదే విధముగా కలిమిలేమి అనగా శ్రీమంతుని ఏదో ఒకనాడు ఈ దరిద్రము వెంటాడుతుంది. దరిద్రుడు కూడా ఏదో ఒకనాడు శ్రీమంతుడు కాగలడు. ఈనాడు కీర్తివంతుడు కావచ్చు రేపు అపకీర్తిని పొందవచ్చు. అయితే ఈ కీర్తి అపకీర్తులను, కష్టసుఖములను, సిరి సంపదలను సమముగా భావించి సమస్థితిని పొందటమే మానవుని ప్రధాన విశిష్టత.

సుఖదుఃఖములు, కష్టసుఖములు సమంగా భావించి అనుభవించిన వానికే నిజమైన మానవ జీవితం విలువ తెలుస్తుంది. నిజముగా దుఃఖమే లేకుండిన మానవులకు సుఖము యొక్క విలువయే తెలియదు. సుఖము యొక్క విలువను గుర్తించవలెనన్న దుఃఖమును తప్పని సరిగా అనుభవించాలి.

కష్టసుఖములు రెండును గలసి యుండు
వాని విడదీయు టెవ్వరి తరము కాదు
సుఖము ప్రత్యేకముగ నెందు చూడలేము
కష్టము ఫలించె నేని సుఖంబటండ్రు.

ఇంతటి భావము నందరు అర్థము చేసుకొని వర్తించటానికి చాలా కష్టమవుతుంది. పగలే లేకుండిన రాత్రికేమాత్రము విలువ లేదు. రాత్రియే లేకుండిన పగలుకు విలువ లేదు. కాని ఈ సత్యమును గుర్తించుకోలేని మానవుడు నిరంతరము తాను సుఖముగానే ఉండాలని

ఆశిస్తాడు. నిరంతరము తాను ఆనందమును అనుభవించాలని భ్రమిస్తాడు. ఇది అసాధ్యము. దుఃఖము ఉన్నప్పుడే ఆనందమునకు విలువ. కష్టము ఉండినప్పుడే సుఖమునకు విలువ. ఎండలో నడచి వచ్చినప్పుడే చెట్టునీడ యొక్క విలువ. అదే విధముగా మానవునకు కష్టము ఎందుకు రావాలి, దుఃఖము ఎందుకు రావాలి అని ప్రశ్నించే వారికి commonsense లేదనే చెప్పవచ్చు. ఈనాటి విద్యా విధానములో commonsense, general knowledge రెండూ కరవయ్యాయి. ఆకలే లేకుండిన అన్నమును ఎవరు ఆశిస్తారు? heat లేకుండిన air conditioner ఎవరు కొంటారు? ఈ రెండింటి వ్యత్యాసము చక్కగా గుర్తించిన వ్యక్తికే ఈ కష్టసుఖముల విషయము చక్కగా అర్థమవుతుంది.

ఆధ్యాత్మిక రంగమునగానీ, భౌతిక రంగమునగానీ, లౌకిక రంగమునగానీ, ఏ రంగమునందైనా కష్టముల వలనే మానవుని కీర్తి ప్రతిష్ఠలు ఉన్నత స్థాయిని పొందుతున్నాయి. సత్యము నిమిత్తమై తాను అనేక కష్టములకు గురౌతూ వచ్చాడు. ఏమైనప్పటికి సత్యమును నేను వదలను. సత్యమును రక్షించే నిమిత్తమై భార్యాబిడ్డలను కోల్పోయాడు. సత్యము నిలబెట్టే నిమిత్తమై రాజ్యము కూడా కోల్పోయాడు. కడపటికి తానే బానిస అయ్యాడు. ఇన్ని కష్టములకు, దుఃఖములకు, విచారములకు, అపకీర్తులకు లోనయ్యాడు కాబట్టే తాను సత్యహరిశ్చంద్రుడు అని శాశ్వతమైన పేరు పొందగలిగాడు. లేకపోతే అతనికి హరిశ్చంద్రుడని పేరు మాత్రమే నిల్చి ఉండేది. దేని నిమిత్తమై సర్వస్వము కోల్పోయాడో తాను పడిన బాధతో సత్యాన్ని నిలపగలుగుతూ వచ్చాడు. ఇదే determination. ఈ పట్టుదల మానవునిలో ఉచితంగా కావాలి. ఎలాంటి కష్టనష్టములు, దుఃఖములు వెంటాడినప్పటికీ దేనిని లెక్కపెట్టక తన లక్ష్యము సాధించటానికి దేహమైనా అర్పితము చేయాలి. ఇదే సత్యాన్వేషణము యొక్క సహజలక్షణము. కష్టములందే సుఖము విలువ తెలుస్తుంది. మీకందరికి తెలుసు. చిన్న బాలుడు. ఐదు సంవత్సరముల బాలుడు ప్రహ్లాదుడు. అతడు దైవాపేక్షతో నిరంతరము నారాయణ చింతన చేస్తూ వచ్చాడు. కన్న తండ్రియే అనేక కష్టములకు గురికావిస్తూ వచ్చాడు. కడపటికి ప్రాణము తీయుటకు కూడా సంకల్పించాడు. అంతటి కఠినహృదయుడైన తండ్రి హృదయాన్ని కరిగించి, కదిలించి, విజయాన్ని సాధిస్తూ వచ్చాడు. ఇన్ని విధములైన కష్టములను అనుభవించటం వలనే ప్రహ్లాదుడు శాశ్వత కీర్తి సంపాయించుకో కలిగాడు. కష్టములకు లొంగిపోలేదు. కష్టములను

09079603

సాధిస్తూ వచ్చాడు.

కనుకనే కష్టములు మనకు అనంతమైన గౌరవమును, కీర్తిప్రతిష్ఠలను, ఆనందాన్ని అందించ గలుగుతుంది. కాని మానవుడు కష్టము గాని, దుఃఖమును గాని ఏ మాత్రం అంగీకరించడు. ఇది చాలా పొరపాటు. మానవ జీవిత రహస్యము మనం గుర్తించవలెనన్న కష్టసుఖములు రెండు మనము అనుభవించవలెను. ఇది అనుభవించకుండా నిజమైన శాంతిని, ఆనందమును మనము అనుభవించలేము. సత్య నిత్యమైన ఆనందము మనం అనుభవించవలెనన్న కష్ట నష్టములకు మనం గురికావాలి. రెండు బాధల మధ్యలోనే ఒక సుఖము ఉంటుంది. ఈ సత్యమును గుర్తించిన వ్యక్తి కష్టములకేమాత్రం కృంగడు. సుఖములకు, ఆనందములకు ఏమాత్రం పొంగడు. కాని ఈనాటి మానవుడు తుచ్ఛమైన అల్పమైన, క్షణికమైన ఆనందముల నిమిత్తమై శాశ్వతమైన కీర్తిని నాశనం చేసుకుంటున్నాడు. క్షణికమైన ఆనందము పొందే నిమిత్తమై శాశ్వత కీర్తిని పోగొట్టుకుంటున్నాడు. అపకీర్తుల పాలౌతున్నాడు మానవుడు. కారణము ఏమిటి? అల్పమైన విషయములకై తాను పెడమార్గము పడుతున్నాడు. కలి ప్రభావము అనుకోవచ్చు. లేక ఈనాటి ఆధునిక సమాజము యొక్క ప్రభావము అనుకోవచ్చు. ఈనాటి మానవుడు అల్పవిషయములకే అమితంగా కష్టపడుతున్నాడు కాని శాశ్వత సంతోషము స్థిరమైన దానికోసం ఏమాత్రము ప్రయత్నించటం లేదు. చిన్న ఉదాహరణ. ఒక గ్రామము నుండి మరొక గ్రామము బస్సులు నడుస్తూ ఉంటాయి. బస్సులో 50 సీట్లు ఉంటాయి. వచ్చే ఇరవై రూపాయల కోసము 50 సీట్ల బస్సులో 70 మందిని ఎక్కించుకుంటాడు. కాని వచ్చే రెండు రూపాయల కోసం చూస్తున్నాడు గాని టైరు పంచరౌతుందని గుర్తించటం లేదు. అదే విధముగా ప్రాకృతమైన అల్పవిషయములలో పెడమార్గము పట్టి శాశ్వత కీర్తిని కోల్పోతున్నాడు మానవుడు.

యువకుడు ఏ రీతిగా ఉండాలి. యువకుడు ఏ రీతిగా ఉండినప్పుడు శాశ్వత సత్కీర్తి సాధించవచ్చును. మన దృష్టి ఎటువంటిదిగా ఉండాలి? మన శ్రవణం ఎటువంటిదిగా ఉండాలి? మన మాటలు ఎటువంటివిగా ఉండాలి? ఈ మూడింటిని మొట్టమొదట అదుపులో పెట్టుకోవాలి. కన్నులున్నాయి కదా యని అన్నింటిని చూడరాదు. ఈ కన్నులు దేనిని చూడాలో దానిని చూడాలి కాని అన్నింటిని చూడటం అపవిత్రము. ఇది చాలా పాపాని

రూపంగా ఉంటుంది. ఇట్టి పాప దృష్టిలో ప్రవేశించటం చేత, కేవలం అల్పమైన దృష్టివల్ల
నీకేమి కడుపు నిండింది. ఒక స్త్రీని చూస్తే నీకేమి లాభము కలుగుతుంది? అపకీర్తి
లభిస్తుంది. పది మందిలో మొహం ఎత్తుకొని తిరిగే అధికారాన్ని కూడా కోల్పోతున్నారు.
చూడవలసిన దానినే మనం చూడాలి కాని చూడకూడని దానిని మనం చూడకూడదు.
యువకులు మీరు వేరు విధముగా భావించకూడదు. జగత్తులో జరిగే విషయాలు చెప్పి
మిమ్మల్ని సరైన మార్గములో ప్రవేశపెట్టటం నాకర్తవ్యము. ఈనాటి ప్రపంచము ఎలా ఉన్నదం
టే ఇరవై అయిదు సంవత్సరముల అన్న, ఇరవై సంవత్సరముల చెల్లి ఇరువురు ఎక్కడికో
ప్రయాణమై పోతున్నారు. కాని ఈ వయస్సు ప్రమాణం పురస్కరించుకొని అందరు వీరిరు
వురు భార్యా భర్తలు అనుకుంటారు. ఈ ప్రయాణం వల్ల ఎంత అపకీర్తి వచ్చింది. నిజముగా
వారు అన్న చెల్లెలే. ప్రాచీన సాంప్రదాయాన్ని పురస్కరించుకొని భారతీయ సంస్కృతి యొక్క
విశిష్టతను పురస్కరించుకొని అన్నా చెల్లెలు అయినా సరే ఇరువురు కలసి ప్రయాణం చేయ
కూడదు. ఒక సినిమాకు గాని, బీచికి గాని, షాపింగ్ కు గాని అన్న చెల్లెలు పోకూడదు. తల్లితో
కాని, తండ్రితోగాని పోవాలి. ఈ విధమైన బంధనలు ఆనాటి కాలములో సత్య నిబంధనలుగా
వ్రాసిస్తూ వచ్చారు. ఇప్పుడు చెడు భావంతో అరవై సంవత్సరముల ముసలివాడు, పదహారు
సంవత్సరముల కన్నె ఇరువురు ప్రయాణమై పోతుంటే grand father, grand
daughter అంటారు. కాని లోపల చింతలు చెడ్డవి. దుర్మార్గమైన భావములు కానొస్తున
ఊహాలు grand father, grand daughter. ఉత్తమమైన భావంతో పోయే అన్న చెల్లెలు
ని చూచినా వారికి చెడ్డ భావం కల్గుతుంది. సద్భావం ఉండినప్పటికి సమాజము వారిని చెడు
గా భావిస్తుంది. కనుక ఇలాంటి అపకీర్తులకు మనము అవకాశము ఇవ్వరాదు. పోతే
అవసరం వస్తే నీవు ఒక్కడివు వెళ్ళు. చెల్లెలను తీసుకు వెళ్ళవద్దు. ఇద్దరు కలసి ప్రయాణం
చేయకూడదు అన్నారు ప్రాచీన సంస్కృతిలో. దేనికోసం? కీర్తి ప్రతిష్టల కోసం. ఇంటి పరువు
నిలబెట్టుకొనే నిమిత్తమై. మన కుటుంబము యొక్క మర్యాదను కాపాడుకొనే నిమిత్తమై
ఈనాటి యువకుల కనుదృష్టి చాలా చెడ్డదిగా మారుతున్నది. ఇది కనుదృష్టి కాదు కాకిదృష్టి
అనవచ్చు. ఇది ఒక్క తీరి చూడదు. అటు ఇటు చూస్తూ వుంటుంది. కారణం ఏమిటి?
దానికది సహజం. ముక్కు పొడుగ్గా ఉండటంచేత ఆ కన్నుది ఈ కన్నుకి కనిపించదు.

నీకు కాకి ముక్కులాంటి ముక్కు లేదే. కనుక నీవు ఎందుకు కాకి దృష్టిగా చూస్తున్నావు. నీవు దృష్టిని straight గా పెట్టుకోవాలి. ఇది యువకుల యొక్క ప్రధానమైన సత్ దృష్టి. దీనినే సుదృష్టి సునేత్రము, సుదర్శనము అంటారు.

ఇంక నోరు. ఎవరి దగ్గర ఎలా మాట్లాడాలి? ఎప్పుడు నవ్వాలి? ఎప్పుడు నవ్వకూడదు అనేది విద్యార్థులు బాగా గుర్తించాలి. ఒకో సమయంలో సమాజములో ఏదో దృశ్యము చూసి నవ్వటం జరుగుతుంది. నవ్వు నాలుగు విధముల చేటు అన్నారు. ద్రౌపదికి ఇన్ని కష్టములు రావటానికి ఇదే కారణము. మయ సభ అని కట్టించాడు ధర్మజుడు. మయుడు కట్టి ధర్మజునికందించాడు. ఆసభ ఎటువంటిదనగా stones ఉన్నదగ్గర లేనట్లుగను లేని దగ్గర ఉన్నట్లుగను కనిపిస్తుంది. నీళ్ళు లేని దగ్గర నీరున్నట్లు కనిపిస్తుంది. కాలువ ఉన్నదగ్గర లేనట్లు కనిపిస్తుంది. ఇందులో ప్రవేశించాడు ధర్మజుడు. ఏదో గొప్ప మయసభ కట్టించాడు ధర్మజుడనే అసూయతో దానిలో ప్రవేశించాడు. నేరుగా వెడుతున్నాడు. door లేని దగ్గర door ఉన్నట్లు కన్పించింది. door ఉన్న దగ్గర లేనట్లుగా కనిపించింది. ఇతను door లేదు కదా అని సరక్– వి పోతూ వచ్చాడు. టక్ అని కొట్టింది. తాను సర్దుకున్నాడు. ముందుకు వెళ్ళాడు. ఏమి నీరుగాని lake గాని ఉన్నట్లు కనిపించలేదు. అటునిటూ చూచుకుంటూ పోతున్నాడు. లోపల ఒకవైపు అసూయ ఉంటుంది. ఈ అసూయే ఈ అధిక పతనమునకు మూలకారణము. పోతూ పోతూ లేనట్లుగా కన్పించిన కాలువలో పడ్డాడు. ఆ సమయంలో ఎవరికైనా నవ్వు వస్తుంది. ద్రౌపది చెలికత్తెలు ఘల్లున నవ్వారు. స్వాయంగా చూస్తే ద్రౌపది లేదక్కడ. పాపం. ఈ చెలికత్తెలు ఇంత శబ్దం చేసి నవ్వుతూ ఉండటం చూసి లోపలినుండి ద్రౌపది వచ్చింది. దురదృష్టవశాత్తు దుర్యోధనుడు ఆమె అక్కడికి వచ్చాక చూచాడు. ఆమెయే నవ్విందని అపోహపడ్డాడు. నన్ను చూసి నవ్వింది కనుక నిన్ను చూసి సభలో నల్గురూ నవ్వేటట్లుగా చేస్తానని ప్రతిజ్ఞపట్టాడు. కనుక ఎప్పుడు నవ్వాలి, ఎక్కడ నవ్వాలి, ఏవిధంగా నవ్వాలి తెలుసుకోవాలి. ఇందులో రెండు ఉంటున్నాయి హాసన్, ప్రహాసన్. హాసన్ అనగా చిరునవ్వు నవ్వటం. ప్రహాసన్ అనగా హ్హహ్హా హ్హా అని గట్టిగా నవ్వటం. ఇది చాలా చెడ్డది. ఇద్దరు ముగ్గురు మిత్రులు చేరి నవ్వుకుంటూ ఉంటారు. ఆ దారిలో ఎవరో స్త్రీలు వెడుతూ ఉంటారు. వాళ్ళు అపోహలు పడతారు. నీవు దేనికోసం నవ్వినావో అది వేరు. కనుక ఎవరైనా స్త్రీలు పోతున్నప్పుడు మనం ఎలాంటి విషయమైనా నవ్వరాదు.

పరాయి స్త్రీలను చూచి నీవు నవ్వినప్పుడు నీ వారిని చూసి ఇంకొకరు నవ్వరా? కొంత మంది పని లేకపోయినా షాపుల ముందర కూర్చుంటారు టౌన్సులో. ఈ షాపింగ్ చేసే వారినో లేక అటు ఇటు పోయే వారినో చూసి ఊరికే నవ్వుతూ ఉంటారు. ఇలాంటి దుర్మార్గమైన దృష్టి కలిగిన వారికి తమ స్త్రీలు ఏనాడైనా షాపింగుకు పోతే వారిని చూసి ఇంకొకరు నవ్వుతారు. కాబట్టి ఈ reaction, rebound, reflection తప్పవి కావు. ఈ కర్మఫలం అనుభవించి తీరాలి. వాని వల్ల దైవాన్ని కూడా దూరం చేసుకుంటారు. ఎందువల్ల? అప్రదిష్టలు తెచ్చేవారు దైవసన్నిధిలో ఉండటానికి వీలుకాదు. కనుక మన నవ్వును అదుపులో పెట్టుకోవాలి.

అంతేకాదు. మన మాటలు కూడా అదుపులో పెట్టుకోవాలి. ఎక్కడ ఏవిధంగా మాట్లాడాలి. ఇంకా కొంతమంది స్త్రీలు వెడుతుంటే పిచ్చిపిచ్చి పాటలు పాడుతుంటారు. ఆ నాలుకతో అదేనా నీవు పాడవలసినది- ఎంత పవిత్రమైన నాలుక! ఎంత హాస్యాస్పదమైన పదములు. ఈ పదములు ఉపయోగపెట్టటంచేత నీకొత్తని నాశనం చేసుకుంటున్నావు. నీవు అప్రదిష్టపాలై పోతున్నావు. కేవలం హాస్యాస్పదమునకు గురైపోతున్నావు. కనుక మనం మాటలను, చూపులను నవ్వును కొంతవరకు అదుపులో పెట్టుకోవాలి. మనము గౌరవము సంపాయించుకోవాలంటే గౌరవానికి సంబంధించిన చేష్టలు మనలో ఉండాలి. మనం మంచిగా ఉన్నప్పుడే మన గౌరవం పెరుగుతుంది.

గౌరవమ్ము, అగౌరవము రెండు సమంగా తీసుకోవాలి. మంచి చెడ్డలు రెండు సమంగా తీసుకోవాలి. కీర్తి అపకీర్తులు రెండు సమంగా తీసుకోవాలి. అదే మానవుని యొక్క సమత్వము. అప్పుడే ఈ మానవుడు మాధవుడు కావటానికి వీలుంటుంది. అవకాశముంటుంది. కానీ మానవుడని అన్పించుకొని మానవుడు చేయవలసిన దానికి విరుద్ధంగా ప్రవర్తించినప్పుడు పశువుగా మారిపోతాడు. పశువు నుండి వచ్చాడు. తిరిగి పశుస్థానానికి వెళ్ళిపోతున్నాడు. నీవు ముందుకి పోవాలిగాని వెనుకకు పోరాదు. కొంతమంది ఆఫీసర్సుకు reversion ఉంటుంది. promotionకు బదులు reversion వస్తుంది. దీనికి కారణం ఏమిటి? ఏదో దోషముంది. దోషము ఉండినప్పుడే reversion వస్తుంది. ఏదోషము లేకపోతే promotion వస్తుంది. చిన్న ఆఫీసు. ప్రాకృతమైన ఉద్యోగము. దీనిలోనే promtion, reversion వస్తుంటే దైవానుగ్రహము లోపల ఇంక ఎంత గట్టిగా మనం చూచుకోవాలి.

నీవెంత పవిత్ర మార్గములో ప్రవేశిస్తావో దానికి తగిన ప్రమోషన్ ఇస్తాడు. నీవే సాధనలు చేయక పోయినా ఫరవాలేదు. నాయనా నీసద్గుణమే నాకు నచ్చింది come on అని పిలుస్తాడు. నీవు ప్రార్థించ నక్కర లేదు. తానే welcome చేస్తాడు. కారణము ఏమిటి? ఆ విశ్వాసము. ఆజ్ఞ పరిపాలన, పవిత్రమైన భావాలు. మానవుడు ఆశించిన మాధవుడు నియమించిన నియమములకు విరుద్ధముగా పోయినప్పుడు refuse చేస్తాడు. ఏది శాస్త్రము? ఏది చేయకూడదో దానిని శాసించారు. చెడ్డ దృష్టి వద్దు. చెడ్డ పలుకు వద్దు. చెడ్డ వినికిడి వద్దు. మంచిది కాదు. ఇదే శాసనం. ఈ శాసనము అనుసరించినప్పుడే God నిన్ను welcome చేస్తాడు. దీనికి విరుద్ధముగా చేసినప్పుడు God నిన్ను దూరము చేస్తాడు. దూరము చేయటమే కాదు నీ ముఖము కూడా చూడడు. కారణం ఏమిటి? దైవశాసనము ఉల్లంఘించాడు. ప్రకృతి గౌరవము పోగొట్టుకున్నాడు. కీర్తి ప్రతిష్టలు నిర్మూలము గావించుకున్నాడు. తన సిరిసంపదలు కోల్పోయాడు. ఇలాంటి వాటిని చేర్చుకోటం. కనుక మొట్టమొదట మనయొక్క గుణములు సక్రమైనవిగా అభివృద్ధి పరచుకోవాలి. పరార్థమును పోషించుకొనుటకు తగిన కృషి చేయాలి. సమత్వం యోగముచ్యతే. యోగం కర్మసు కౌశలం. ఎంతో మంది మనలను దూషిస్తారు. దూషించినారని మనం వెనకను పోకూడదు. దూషించినారని కృంగిపోకూడదు. భూషించినారని మనం పొంగిపోకూడదు. మనలో దోషము లేనప్పుడు ఎవరు దూషిస్తే మనకేమి? నాలో దోషము లేదు. నేనెందుకు కృంగిపోవాలి. కాబట్టి దీనిని ఎదుర్కొనాలి. ఈ దోషం నాది కాదు. అట్టి ధైర్యసాహసములు మనం కోల్పోకుండా ఉండాలంటే చక్కని ధైర్యసాహసములతో సక్రమమైన మార్గములో నడవాలి. పిల్లలు ఒక తూరి గట్టిగా నవ్వుతుంటారు. కొన్ని సమయములలో నవ్వవలసి వస్తుంది. అప్పుడప్పుడు డ్రామాలు వేస్తే వాస్తును వేస్తే నవ్వవలసి వస్తుంది. నేను కూడా నవ్వుతుంటాను. కాని పది మందిలో నుండినప్పుడు ఈ నవ్వును మనం కంట్రోలులో పెట్టుకోవాలి.

కొన్ని దినములు శరతల్పముపై పడుండినాడు భీష్ముడు. కృష్ణుడు పాండవులను తీసుకు వెళ్లాడు. అంత్యసమయములో పితామహుడు భీష్ముని దర్శనం చేయించాలని, అతనితో సంభాషించాలని ఆశతో తీసుకు వెళ్లాడు కృష్ణుడు. భీష్ముని జ్ఞాన తత్త్వం వినాలని మహర్షులందరు ఒకవైపు కూర్చున్నారు. బంధువులు మరొకవైపు కూర్చున్నారు. కౌరవులు లేరు కదా ఊడ్చుకుపోయారు. వారి దుష్కృత్యమే వారిని హరించివేసింది. పాండవులు మాత్రమే ఉన్నారు. శకునికూడా

09079608

పోయాడు. కర్ణుడు కూడా పోయాడు. ఎవరు లేరు. పంచ పాండవులు మాత్రమే ఉన్నారు. అయితే ఆ సమయమునను విదురుడు కూడా వచ్చాడు. పాండవులను వదలి ద్రౌపది ఉండేది కాదు. ద్రౌపది వచ్చింది. భీష్మునికి నమస్కారము చేసింది. కూర్చుంది. ఆమె అగ్నినుండి ఆవిర్భవించినది. ఆమె సద్గుణములకు కృష్ణుడు ఎంతో మెచ్చుకున్నాడు. పతివ్రత అంటే సత్యభామ, రుక్మిణి కూడా కాదన్నాడు కృష్ణుడే. ఐదు భర్తలున్న ద్రౌపది పతివ్రత అన్నాడు. అందరు నవ్వుకున్నారు. దీనికి కారణము చెబుతాను వినమన్నాడు కృష్ణుడు.

పతుల పలు మాటలకు ఎదురు చెప్పంగబోదు
వారిసేవలు చేయగా విరదనదు
తనకున్న దానిచే తృప్తి గను చుండు
ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు.

కనుక ద్రౌపది చాలా పతివ్రత అన్నాడు. పంచ పాండవులు పంచ ప్రాణములే. ప్రాణ అపాన వ్యాన ఉదాన సమాన అని ఐదు రూపాలుగా కనుపిస్తున్నాయి. ఆమెకు పంచ ప్రాణములే పతులు. వాయుపుత్రుడు భీముడు. ఇంద్రుని పుత్రుడే అర్జునుడు. పంచప్రాణములు ఆమెకు భర్తలుగా మారారు. ఐదుమంది ప్రాకృతమైన భర్తలు కాదు. ఇలాంటి సమయములో భీష్ముడు ధర్మాన్ని బోధిస్తున్నాడు. ధర్మజా! రాజ్యమును జయించావు. కృష్ణుని అనుగ్రహము వలన పొందగలిగావు. కృష్ణుడు ఎవరనుకున్నావు. నీ మిత్రునిగా, బావమరిదిగా భావిస్తున్నావు. రక్తసంబంధునిగా భావిస్తున్నావు. చాలా పొరపడుతున్నావు. సాక్షాత్ నారాయణుడు. దేహ సంబంధమును మీరు పెట్టుకోవద్దు. అలాంటి భగవంతునితో మీరు ఆడు కొని పాడుకొని కాలము గడుపుతున్నారు. ఎంత అదృష్టము మీది' అని చెప్పి శాంతి పర్వమును బోధిస్తున్నాడు. ఏరీతిగా ఉండాలి. ఏరీతిగా నడచుకోవాలి. ఎలాంటి స్థితిలో మనస్సు ధైర్యంగా ఉండాలి. మానవుని జీవితమునకు సంబంధించిన ధర్మాలు బోధిస్తున్నాడు.

పాండవులందరు తలలు వంచుకొని వింటున్నారు. ద్రౌపది భరించుకోలేకపోయింది వెర్రిగా నవ్వలేదు. అవమానంగా నవ్వలేదు. ఇంతమందిలో ద్రౌపది నవ్విందని భీముని భుజములు కదిలిపోయినాయి. ధర్మమూర్తి ధర్మరాజు కనుఎత్తి ద్రౌపదిని చూచాడు. అర్జునుడు ద్వేషముగా చూచినట్లు కన్నులతో చూచాడు. సభలో నవ్వటమేమిటని కోపంగా చూశాడు. సత్యమును గుర్తించుకున్న భీష్ముడు ధర్మజా, అర్జునా, భీమా నకులసహదేవులారా

09079609

మీరు ద్రౌపదిని తప్పుగా అర్థము చేసుకుంటున్నారు. ఆమె చాలా పవిత్రురాలు. ఆమెను తప్పు పట్టటానికి వీలు లేదు. కారణం లేక నవ్వదు. నేనే కారణం అని చెప్పి ద్రౌపదిని దగ్గరకు పిలిచాడు. 'అమ్మా! నీవు నవ్వినందుకు కారణం చెప్పు. పది మంది సత్యము తెలుసుకుంటారు' అప్పుడు ద్రౌపది చెప్పింది 'పితామహా! నీ వాక్యమునకు మేము ఎప్పుడు గౌరవము నందిస్తున్నాం. సత్యమునకే మా జీవితమును అంకితము చేస్తున్నాము. అలాంటి దానిని నేను హాస్యాస్పదముగా నవ్వటానికి వీలు లేదు. అయితే మీరు మొదటినుండి కౌరవ పక్షములో ఉండి కౌరవులకు సైన్యాధిపతిగా నిల్చారు. చిన్న వయస్సునుండి కౌరవులను పెంచారు. కానీ ఈ ధర్మాలు మీరు కౌరవులకు ఎందుకు చెప్పి ఉండ కూడదు. సత్యమూర్తులైన, ధర్మమూర్తులైన నా పతులకు మీరు ధర్మాలు చెప్పనక్కర లేదు. వారు సత్యధర్మములు తెలిసిన వారు. కానీ సత్యధర్మములు తెలియని కౌరవులకు మీరు ఈ బోధలు ఎందుకు చేయ లేదు. అందుకు నవ్వు వచ్చింది. ఎవరికి బోధ చేయవలెనో వారికి చేయ లేదు. ఎవరికి అక్కరలేదో వారికి చేస్తున్నారు. ఇది మీ బోటి పెద్దలకు సరైనది కాదని' సత్యము చెప్పింది. అప్పుడు భీష్ముడు సత్యము గుర్తించి చెప్పాడు. 'అవును నా దోషమే. నేను మొదటినుండి కౌరవుల తిండి తింటూ వచ్చాను. కౌరవుల మధ్యలో జీవితము గడుపుతూ వచ్చాను. ఆ పాపపు తిండి తినటంచేత నాలో నున్న ధర్మ సూత్రములు అట్టడుగున పడిపోయాయి. నా పాప భావములు తేలుతూ వచ్చాయి. ఈ నాడు నీ భర్త వేసిన అంబుల చేత పై రక్తమంతా కారిపోయింది. చెడ్డ రక్తము పోయింది. దుర్బుద్ధి, దుర్భావముల రక్తము కారిపోయింది. ఇప్పుడు నిశ్చలమైన, నిర్మలమైన రక్తము నానుంచి ఆవిర్భవిస్తున్నది. అందువలన నేను బోధిస్తున్నాను. ఇంత కాలము ఈ ధర్మము బోధించకుండా ఉండటానికి మూల కారణము పాపులైన కౌరవుల భోజనము ఈ విధమైన దోషము కల్పించింది'. మనము తినే తిండి దోషములు అధికముగా ఉంటున్నాయి. పాపపు తిండి మనము భుజించినప్పుడు పాపము భావములే మన నుంచి వస్తుంటాయి. గొప్ప జ్ఞాని భీష్ముడు. కాని ఇట్టి దుర్భావములు అతనికి రావటానికి కారణం ఏమిటి? పాపపు సొత్తు భుజించాడు. food ఎలాంటిదో head అలాంటిదిగా మారుతుంది. నా దోషము ఈ విధముగా నున్నదని ఒప్పుకున్నాడు. ద్రౌపది నవ్వటంలో ఎట్టి దోషము లేదు. నేను బోధనలు చేయటం వల్ల ఆమె నవ్వింది.

అప్పుడు ఋషులు రాజులు ఈ విధమైన తిండి తీర్థాదులలో ఇంత దోషము

ఉన్నదా అని ఆనాడు గుర్తించారు. అట్లే నవ్వులానికి కూడా ఒక అర్హత ఉండాలి. ద్రౌపదికి అర్హత ఉంది. ఆమె సత్యసూత్రాలతో జీవితము గడిపినది. ధర్మాచరణలో తన జీవితము అంకితము చేసింది. ఒకానొక సమయంలో దూర్వాసుడు ఎంతో మంది శిష్యులతో అరణ్యములో ప్రవేశించాడు. పాండవులను అవమాన పర్చాలని వచ్చాడు. ఎంత ఋషి అయినా ధర్మస్వరూపులను ఎవరు ఏమి చేయలేరు. వేలమంది శిష్యులతో వచ్చాడు దూర్వాసుడు. వారికి భోజనం పెట్టాలి. మనం ఏమి చేయాలి? వేలాది ప్రజలకంతా భోజనము పెట్టినాను కొంతమందికి భిక్షము పెట్టలేకుండా పోతున్నాను అని విచారించాడు. ద్రౌపది 'మనమేమి విచారించ నక్కరలేదు. నాథా ఆపద్బాంధవుడు ఉంటున్నాడు అనాథరక్షకుడు ఉంటున్నాడు. సమయస్ఫూర్తిగా సంరక్షించే భగవంతుడున్నాడు. ఇంక విచారమెందుకు? కృష్ణుని ప్రార్థించాలి. కృష్ణా! ఈ సమయంలో నీవు తప్ప మరొకరు కాపాడ లేరు. నా పతులను రక్షించాలి. దూర్వాసుడు మహా కోపిష్టి. అతని కోపమునకు నా పతులు బలి కాకుండా ఉండాలి. నేను బలి అయినా ఫరవాలేదు. తన స్వార్థమును త్యాగము చేసింది. వారిని రక్షించమని కోరింది. అప్పటికప్పుడు కృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు. ఎప్పుడో బయలుదేరి వచ్చినట్టుగా చెబుతున్నాడు ద్రౌపదికి మీరు అడవికి వచ్చినప్పటి నుండి మిమ్మలను చూడాలని ఉంది సామాన్యమానవుని వలె చెబుతు వచ్చాడు. అతను కొత్త నటన చేస్తూ వచ్చాడు. 'ద్రౌపదీ చాలా ఆకలి వేస్తున్నది'. దూర్వాసునికే అన్నం పెట్టలేకుండా పోతున్నాము. నీవు ఎక్కడ అన్నం పెడతాము నీవే వచ్చి అన్నం కావాలంటున్నావు. 'బ్రహ్మాండమంతయూ బొజ్జలో నున్నట్టి నీకు భక్ష్యభోజ్యంబులు పెట్టతగునా!' ఎక్కడ నుంచి తెచ్చేది? మేము అడవుల పాలై పోయినాము. కందమూలాదులతో గడుపుతున్నాము. కృష్ణా నీవే చెప్పు తప్పక ఇస్తాను. ప్రాణమైనా ఇస్తాను అంది. ద్రౌపదీ! నీవు ఉదయం వండిన పాత్ర తీసుకొనిరా! శేషము ఏమైనా ఉందేమో చూడమన్నాడు ద్రౌపది ఏ పని చేసినా పరిశుద్ధముగా చేసేది. పాత్రలు శుభ్రము చేస్తే అంత శుభ్రముగా ఉండేవి. ఇల్లు ఎప్పుడు అద్దము వలె శుభ్రముగా ఉండేది. 'కృష్ణా! నీకు తెలియదా. బాగా తోమి పెట్టాను పాత్రలు. ఏ మాత్రము ఉంచలేదు' అంది. 'తీసుకొనిరా' అన్నాడు. కృష్ణాజ్ఞను శిరసావహించింది. ఏమి చెబితే అది చేయుటయే ద్రౌపది స్వభావము. కృష్ణుడు పాత్రను అటూ ఇటూ తిప్పాడు పాత్ర వెనుక కంఠము దగ్గర బలుసాకు కరచుకొని ఉంది. ఆకు కూర వండింది పాపం. అది వేయమన్నాడు. దానిని తీసి కృష్ణా అని వేసింది పాపం. అక్షయం అన్నాడు. దానితో కృష్ణుని కడుపు

నిండిపోయింది. భగవంతుడు తృప్తి అయితే ప్రపంచమంతా తృప్తి అయిపోతుంది. భగవంతునికి కొనప్పుడు ఎవరికీ కాదు. భగవంతుడు ఇలా అంటే అందరూ ఇలా అంటారు. దూర్వాసుని శిష్యులందరికి కడుపులు నిండిపోయాయి. స్నానమునకు వెళ్ళినవారు అటునుంచి అటే వెళ్ళిపోయారు. ఇక్కడికి రాలేదు. ఈ విధముగా ద్రౌపది సుగుణము అంత భక్తి ప్రపత్తులతో కూడినది. ఇన్ని కష్టములకు గురికావటముచేత ఆమె యొక్క పేరు ప్రతిష్ఠలను భగవంతుడు మెచ్చుకున్నారు. మనము వారి మెప్పులను వీరి మెప్పులను ప్రయత్నము చేయనక్కరలేదు. ముఖ్యమైన విషయములకై దైవమును ప్రార్థన చేయనక్కరలేదు. భగవంతుని మెప్పును పొందుటకు తగిన కృషి చేయాలి. ఆ మెప్పు ఒక్కదాని పొందితే ప్రపంచము పొందినట్లే. భగవంతుడు ప్రేమపూర్వకముగా ఉన్నప్పుడు ప్రపంచమంతా మన హస్తగతమై పోతుంది. త్యాగరాజు చెప్పాడు నీ అనుగ్రహ బలము ఒక్కటుంటే నవగ్రహములు నా హస్తగతమై పోతాయి. అన్నాడు. భగవంతుని అనుగ్రహమునకు పాత్రుల కావాలంటే కష్టనష్టములు, సుఖదుఃఖములు, కీర్తి అపకీర్తులు అన్నింటిని మనము ఎదుర్కోవాలి. అన్ని సమయములందు మనం భగవంతుని నామము స్మరించాలి. భగవంతుని ప్రేమకు మనం పాత్రులు కావాలి. ప్రేమకు పాత్రులైతే దేనికి వెతకనక్కరలేదు. ఆ ప్రేమకు పాత్రులు కావాలి. మనము భగవంతుని అనుగ్రహమునకై మనము సమయము పెంచుకొనుటకు ప్రయత్నించాలి.